


# కరపత్రం

SINCE 2014

ఆదివారం ఆగస్ట్ 17 2025 సంపుటి :0 సంచిక :302 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

# భారత్‌కు శుభాంశు శుక్లా.. మోదీతో భేటీ అయ్యే అవకాశం..!

యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు వ్యోమగామి శుభాంశు శుక్లా . ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన భారత్‌కు పయనమయ్యారు. రాగానే ప్రధాని మోదీ తో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

యాక్సియం-4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు తెలిపారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను విమానంలో కూర్చొన్న ఫొటోను పంచుకున్నారు. ఆదివారం భారత్‌కు రానున్న శుక్లా.. సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొంటారని వెల్లడించాయి.

**ఇస్రో ఛైర్మన్‌కు తమిళనాడు ప్రభుత్వ పురస్కారం**

ఇటీవల నిర్వహించిన యాక్సియం-4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. వచ్చిన వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కి (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.





## రాష్ట్రపతికి కోర్టు గడువు విధించవచ్చా..? కేంద్రం ఎలా స్పందించిందంటే..!



శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువు లోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై అభిప్రాయాలు తెలియజేయాలని ఇటీవల సుప్రీం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి పంపిన లిఖిత పూర్వక వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. అందులో రాష్ట్రపతి, గవర్నర్‌ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది.

## రూ.4,100 కోట్లతో గ్రేటర్ వరంగల్లో యూజీడీ పనులు

### మంత్రి పొంగులేటి



రూ.4,100 కోట్లతో గ్రేటర్ వరంగల్లో యూజీడీ పనులు :మంత్రి పొంగులేటి రెవెన్యూ, ఉమ్మడి వరంగల్ ఇన్?చార్జి మంత్రి పొంగులేటి

వరంగల్/ ఖిలావరంగల్ (మామునూరు), వెలుగు: గ్రేటర్ వరంగల్ అభివృద్ధే లక్ష్యంగా త్వరలో రూ.4,100 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్ ను డెవలప్ చేయడానికి రూ.5 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. శుక్రవారం ఖిలా వరంగల్ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు.

అనంతరం మాట్లాడుతూ ఓరుగల్లు జిల్లావాసుల చిరకాలవాంఛగా ఉన్నమామునూర్ ఎయిర్‌పోర్ట్ కలను సాకారం కాబోతోందన్నారు. విమానాశ్రయ భూసేకరణకు ఇప్పటికే రూ.205 కోట్లు కేటాయించామన్నారు.

## ఆ ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలి: సీఎం రేవంత్






హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆ ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలని ఆదేశించారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు.“జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. నీటి విడుదలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వాలి. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలి. నగర, పురపాలక, గ్రామాల పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. వైద్యారోగ్య శాఖ అధికారులు అవసరమైన ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలి. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి. జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ తక్షణమే స్పందించాలి” అని సీఎం ఆదేశించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా?: కేటీఆర్



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా? అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. “ఎన్నికల వేళ అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై విమర్శలు చేస్తున్నారు. 24 గంటల్లో భాజపా నేతలు ఎన్డీఎస్ఏను దించి భారత రాష్ట్ర సమితిపై బురదజల్లారు. కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై భాజపా నేతలు మౌనంగా ఉన్నారు. పోలవరం కాఫర్ డ్యామ్ రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించట్లేదా? మేడిగడ్డలో 2 పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్, భాజపా నేతలకు పోలవరాన్ని కూలవరం అనే ధైర్యం ఉందా?” అని కేటీఆర్ ప్రశ్నించారు.

## అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పని చేయాలి: మంత్రి పొన్నం




హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, అందుకు తగిన విధంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జులు, ముఖ్య నేతలతో మంత్రులు సమావేశమయ్యారు. మంత్రులు మాట్లాడుతూ.. ఎర్రగడ్డ డివిజన్‌లో నేతలంతా ఐక్యంగా పని చేయాలని, అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్ బూత్ కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బూత్‌ల వారీగా డివిజన్‌లో ఉన్న 46 బూత్‌ల పరిధిలో సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే అది రాష్ట్ర అభివృద్ధికి సంకేతం అవుతుందన్నారు. తామంతా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు వెల్లడించారు.

## ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. పేజి 2లో ▶

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం ఆగస్ట్ 17 2025

# సంపాదకీయం

## ఓటర్ జాబితాల విశ్వసనీయత ఎంత

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ %-%సర్)ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం గత వారాంతంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కు రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. అవి: ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలిబీ ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలి. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగుతోంది. అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు కొన్ని ఉన్నాయి. అవి అసాధారణమైనవే కాదు, చాలా కలవరం కలిగిస్తున్నవి కూడా. ముందుగా పేర్కొనవలసినది సవరణ ప్రక్రియ పేరు. గతంలో ఓటర్ల జాబితా సవరణను ప్రత్యేక లేదా సంగ్రహ సవరణగా పేర్కొనేవారు. రెండోది సవరణను చేపట్టిన నిర్దిష్ట సమయం: ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. మూడోది టైమ్ షెడ్యూల్: ఈ ప్రత్యేక సమగ్ర సవరణ తొలిదశను కేవలం 30 రోజులలో పూర్తి చేశారు. అభ్యంతరాలు, వాదనలను మరో 30 రోజుల్లో పరిష్కరిస్తారు. నాల్గోది 'సర్' పరిధి: ఇంతకు ముందు ఓటర్ల జాబితా సవరణకు అప్పటికి చివరిసారిగా జరిగిన సవరణను ప్రాతిపదికగా తీసుకునేవారు. అయితే బిహార్ 'సర్'కు 2024ఓటర్ల జాబితాలను ప్రాతిపదికగా తీసుకోలేదు. వాటిని పక్కన పెట్టేశారు. బిహార్‌కు పూర్తిగా సరికొత్త ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ 'సర్' లక్ష్యం, సందేహం లేదు. ఐదోది: ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఎనలేని ప్రాధాన్యమిస్తూ కొత్త ఓటర్ల పేర్లను చేర్చడంపై మౌనం వహించడం. ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ఈ వైఖరి వింతగా ఉన్నది. ఈ ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించినట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించుకున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది.

జనన మరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సరైన విషయమే. అయితే 18 సంవత్సరాల వయసు వచ్చిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం సముచితం కాదూ? ఇది ఎన్నికల సంఘం విధ్యుక్తధర్మం కాదూ? బిహార్ ముడి జనన రేటు (క్రూడ్ బర్త్ రేట్ %-% ఒక నిర్దిష్ట సంవత్సరంలో ప్రతి 1000 మంది జనాభాకు సంభవించే ప్రత్యేక జననాల సంఖ్యను సూచిస్తుంది. ఇది సంతానోత్పత్తి స్థాయి, జనాభా పెరుగుదలకు ప్రాథమిక సూచన) దృష్ట్యా 2024లో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వచ్చిన యువతీ యువకులు లక్షల సంఖ్యలో ఉంటారు. ఇది సందేహాతీతమైన వాస్తవం. మరి ఈ కొత్త వయోజనుల పేర్లను కొత్త జాబితాలో చేర్చారా? ఈసీఐ ప్రతిస్పందించలేదు. కారణమేమిటి? ఎవరికీ తెలియదు. 36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఈసీఐ ఎలా వచ్చింది? ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారా? సంబంధిత వ్యక్తులు తాము శాశ్వతంగా బిహార్ నుంచి వెలుపలి ప్రదేశాలకు వలసపోయామని తమకు తామే అంగీకరించారా? సదరు 36 లక్షల మంది ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించిందా? 'సాధారణంగా స్థానికుడు' అన్న భావన ప్రామాణికతకు న్యాయపరమైన వ్యాఖ్యానాన్ని త్రోసిపుచ్చి దానికి ప్రత్యామ్నాయంగా 'శాశ్వతంగా వలసపోయినవాడు' అన్న భావనను ఈసీఐ ఎప్పుడు, ఎందుకు ప్రవేశపెట్టింది? ఏ ఒక్కరికీ తెలియదు. 'సర్' కార్యక్రమానికి విశ్వసనీయత లేదు, పారదర్శకత లోపించింది, సమర్థించే సాక్ష్యాధారాలు, సహేతుకమైన నిర్ణయాలు కొరవడ్డాయి. అసలు ఈ ప్రత్యేక సమగ్ర సవరణను ముందస్తు భావనలతో చేపట్టినట్టు కనిపిస్తోంది. వాటిని నిరూపించేందుకే ఆ కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నట్టుగా ఉన్నది. జాతి జనాభా ఏటా 0.89 శాతం చొప్పున పెరుగుతున్న దేశంలో ఓటర్ల జాబితా సవరణ ఏ విధంగా చేసినా ఓటర్ల సంఖ్య విధిగా పెరుగుతుంది. అయితే భారత ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన 'సర్' కార్యక్రమం అందుకు పూర్తి విరుద్ధమైన ఫలితాలనే చూపిస్తోంది! 'సర్' అసలు ఉద్దేశం సంఖ్యానేక ప్రజల ఓటు హక్కును రద్దు చేయడమే. ఈ కారణంగానే తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటు వేసేందుకు అనుమతి ఉండదేమోనని ఎంతో మంది బిహారీలు సహేతుకంగానే శంకిస్తున్నారు. 'సర్'ను ఇతర రాష్ట్రాలలో కూడా చేపడతారని తెలుస్తోంది. బిహార్‌లో ఆ ప్రక్రియ ఫలితాల ఆధారంగా చూస్తే కోట్లాది ప్రజల ఓటుహక్కు రద్దయ్యే అవకాశమున్నది. కర్ణాటకలో ఓటర్ల జాబితాకు సంబంధించి బహిర్గతమైన మరొక వాస్తవం ప్రజాస్వామ్యవాదులను అమితంగా జడిపిస్తోంది. ఆ రాష్ట్రంలోని 28 పార్లమెంటరీ నియోజకవర్గాలలో బెంగళూరు సెంట్రల్ ఒకటి. ఆ లోక్‌సభా నియోజకవర్గంలో ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో బెంగళూరు సెంట్రల్ ఫలితాలు చూద్దాం. అందులోని ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలలో ఒకటైన మహదేవపుర విషయాన్ని కాసేపు పక్కన పెడదాం. కాంగ్రెస్ అభ్యర్థి నాలుగు అసెంబ్లీ, బీజేపీ అభ్యర్థి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలోను ఆధిక్యతలో ఉన్నారు. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నికర ఆధిక్యత 82,178 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ఉన్నది. ఇప్పుడు మహదేవపుర నియోజకవర్గ ఫలితాన్ని చూద్దాం. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 1,14,046 ఓట్ల ఆధిక్యత ఉన్నది. ఇది, కాంగ్రెస్ అభ్యర్థికి ఉన్న 82,178 నికర ఓట్ల ఆధిక్యతను రద్దు చేసి బీజేపీ అభ్యర్థికి 31,868 ఓట్ల మెజారిటీతో విజయాన్ని సమకూర్చింది. వీటికి తోడు పోస్టల్ బ్యాలెట్లను కలుపుకుని బీజేపీ అభ్యర్థి మొత్తం 32,707 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. స్పష్టంగా ఉన్న ఈ వివరాలు తుది ఫలితాన్ని అనుమానాస్పదం చేయలేదు. అయితే ఈ 32,707 ఓట్ల ఆధిక్యత ఎలా సాధ్యమయింది? ఈ విషయాన్ని నిశితంగా పరిశీలించాలి. కాంగ్రెస్ అభ్యర్థి, ఆయన బృందం ఓటర్ల జాబితాలు, ఇతర డాక్యుమెంట్లను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి కొన్ని అసాధారణ తప్పులను కనుగొన్నారు. బలవత్తరమైన ఈ ప్రాథమిక సమాచారం ఆధారంగా బీజేపీ అభ్యర్థికి లభించిన ఆధిక్యతలోని గుట్లు తెలుసుకున్నారు. మితిమీరిన సంఖ్యలో విభిన్న ఓటర్లు ఒకే నివాసంలో ఉన్నట్టుగా నమోదయ్యారుబీ సదరు ఓటర్ల ఓటర్ కార్డుపై వారి తండ్రి పేరు Xtkaprbsu అని అర్థంకాని విధంగా ఉన్నది. ఓటరు కార్డుపై ఓటర్ల వయసు '0' లేదా '124' అని ఉన్నది. ఇటువంటి ప్రాథమిక తప్పులు వేల సంఖ్యలో ఉన్నాయి. ఓటర్ల జాబితాలో ఇటువంటి తప్పులు ఉన్నట్టు స్పష్టంగా వెల్లడయినప్పుడు వాటిపై విచారణ జరిపించవలసిన అవసరం లేదా? సామాన్య వ్యక్తి ఎవరైనా 'అవును, జరిపించాల్సిందే' అని వెన్వెంటనే ప్రతిస్పందిస్తాడు. అయితే మన ఎన్నికల సంఘం ఇంకెంత మాత్రం నియమబద్ధమైన ఒక మామూలు వ్యక్తిగా లేదా సంస్థగా వ్యవహరించడం లేదు! తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని, ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీనికానని ఈసీఐ గర్విస్తోంది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పౌర సమాజ ఆక్షేపణలు,
రాజకీయ పార్టీల ఆరోపణల విషయమై పార్లమెంటు ఉభయ సభలలో చర్చించేందుకు గౌరవనీయ సభాపతులు ఇరువురూ విముఖత చూపుతున్నారు. దీనితో ఈసీఐ తనను తాను ఒక 'న్యాయస్థానం'గా భావించుకుంటూ రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు అఫిడవిట్లు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తోంది! ఈ వ్యవహారంలో మహదేవపుర శాసనసభా నియోజకవర్గ ఓటర్ల జాబితా విశ్వసనీయత ఒక ప్రధాన వాదాంశం అన్న వాస్తవాన్ని ఎట్టి పరిస్థితులలోను విస్మరించకూడదు.

## 'ఓట్ల చోరీ' ఆరోపణలు.. చెక్ పెట్టేందుకు సిద్ధమైన ఈసీ?




ఇంటర్నెట్ డెస్క్: కర్ణాటక, బిహార్ సహా దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష నేతలు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విమర్శలకు చెక్ పెట్టేందుకు ఈసీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఓట్ల చోరీ ఆరోపణల వేళ.. ఈ నెల 17న మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. బిహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటు అధికార యాత్ర'ను ప్రారంభించనున్న రోజే ఈ సమావేశం ఏర్పాటుకు ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సమయంలో తప్ప.. ఇతర అంశాలపై ఎన్నికల సంఘం అధికారికంగా విలేకరుల సమావేశం నిర్వహించడం చాలా అరుదు. ఆదివారం నిర్వహించనున్న ప్రెస్ కాన్ఫరెన్స్ వెనుక అసలు కారణాన్ని వెల్లడించనప్పటికీ.. కొంతకాలంగా ఈసీపై వెల్లువెత్తుతున్న ఆరోపణలకు సంబంధించినదని అధికారులు తెలిపారు. ప్రతిపక్షాలు 'ఓటు చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని ఈసీ ఇప్పటికే తప్పుపట్టింది. తప్పుడు కథనాలకు కారణమయ్యే ప్రచారాన్ని చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది.

ఓట్ల చోరీపై 'లాపతా ఓటు' టైటిల్‌తో వీడియో

బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓట్ల చోరీపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్లు చోరీకి గురయ్యాయని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించారు. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల చోరీ జరిగిందన్నారు. ఈ ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరింది. లేనిపక్షంలో దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నడుమే కీలక సమావేశానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## దేశ విభజనపై ఎన్‌సీఈఆర్‌టీ పాఠం..విమర్శించిన కాంగ్రెస్




దేశ విభజన సమయంలోని భయానక పరిస్థితులను వివరిస్తూ..నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విద్యార్థుల కోసం ఓ ప్రత్యేక మాడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో 1947లో జరిగిన దేశ విభజన కు ఒక వ్యక్తి మాత్రమే కారణం కాదని..ఇందులో ముగ్గురి పాత్ర ఉందని పేర్కొంది. విభజనకు పట్టుబట్టిన ముస్లిం లీగ్ అగ్రనేత మహమ్మద్ అలీజిన్నా, దానికి అంగీకరించిన కాంగ్రెస్, అమలు చేసిన లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్ అని తెలిపింది. ఈ విభజన వల్లే భారత్‌కు కశ్మీర్ సమస్యగా మారిందని..నాటి నుంచి కశ్మీర్‌ను పాక్ మార్గంగా చేసుకొని దేశంపై పలు ఒత్తిడులను తీసుకురావడానికి ఉపయోగించుకుంటోందని ఆరోపించింది. 1947లో జరిగిన భారత్ పాకిస్థాన్ విభజన సమయంలో ప్రజల బాధ, బాధితుల వేదనలను గుర్తు చేసుకుంటూ ఏటా ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'విభజన గాయాల స్మారక దినం' గురించి ప్రస్తావించారు.

### విమర్శించిన కాంగ్రెస్

అయితే చరిత్రలో జరిగిన అసలు విషయాలు తెలియజేయకుండా వక్రీకరించారని కాంగ్రెస్ (%జశీఅస్రతీవంం%) సీనియర్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. దేశంలోని లౌకికవాదాన్ని నిర్మూలించాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి చాలా ప్రమాదకరమని అన్నారు.

కాగా గతేడాది తొమ్మిది నుంచి 12వ తరగతులకు సంబంధించిన సిలబస్‌లో అనేక అంశాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించిన విషయం తెలిసిందే. ఈ చర్యలను అప్పట్లో కాంగ్రెస్ వ్యతిరేకించింది. విద్యార్థులకు అసలైన చరిత్ర గురించి చెప్పకుండా..సిలబస్‌ను కాషాయీకరణ చేస్తున్నారంటూ ఆరోపించింది.

## తూర్పు మధ్య బంగాళాఖాతంలో రుతుపవనాల ద్రోణి.. ఉత్తర, దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు



విశాఖపట్నం: ఒడిశా-ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య అల్పపీడనం బలహీనపడిందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. విశాఖ మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతంలో రుతుపవనాల ద్రోణి కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఆదివారం ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. ఉత్తరాంధ్రలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు చెప్పారు. ఈ రోజు పార్వతీపురం మన్యం జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్, ఆదివారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయనున్నట్లు విశాఖ వాతావరణ కేంద్రం అధికారిణి సుధా వల్లీ తెలిపారు.

## రూ.4,100 కోట్లతో గ్రేటర్ వరంగల్లో యూజీడీ పనులు

మొదటి పేజీ తరువాయి

24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వర్క్స్ స్పీడప్ చేస్తామన్నారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, వరంగల్ కొత్త బస్టాండ్, కాళోజీ కళాక్షేత్రం, నర్సంపేటలో మెడికల్ కాలేజీ, భద్రకాళి ఆలయ మాడవీధులు, రాజగోపురాలు, చెరువు ఆధునీకరణ పనులు నడుస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 5వేల ఎకరాల్లో పామ్ ఆయిల్ తోటలు పెంచడమే తమ లక్ష్యమని, జిల్లాలో ఈ ఏడాది 31 లక్షల మొక్కలు నాటడమే టార్గెట్ అని చెప్పారు.

బ్యాంకు లింకేజి కింద 7933 స్వశక్తి మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రూ.475 కోట్ల రుణాలు మంజూరు చేసి రికవరీ చేసిన క్రమంలో జిల్లాకు అవార్డులు రావడం అభినందనీయమన్నారు. మత్స్యశాఖ ద్వారా 11 వేల టన్నుల చేపలు, రొయ్యలు ఉత్పత్తి చేశామని, రిజర్వాయర్లు, మధ్య తరహా చెరువుల్లో 82 లక్షల చేప పిల్లలు వేసి 16 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.

కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కలెక్టర్ సత్యశారద, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్‌తో కలిసి స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు.

## ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల వివరాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు.

వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు కల్వర్టులు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద ఇంజినీర్లు విధిగా తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. అందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్ శాఖల విభాగాలతో ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజా రవాణాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టులు వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా పెట్టారు: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా పెట్టిందని భారత రాష్ట్ర సమితి నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మేడిగడ్డ ఆనకట్ట వద్ద శబ్దాలు వినిపించాయని ఏఈఈ రవికాంత్ ఫిర్యాదు చేశారని, అక్టోబర్ 2023, 21న సాయంత్రం 6.30 గంటలకు మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని గుర్తు చేశారు. అసాంఘిక శక్తులు ఉన్నాయని ఏఈఈ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ.. ఈ కేసు విచారణపై ఎలాంటి పురోగతి లేదన్నారు. " పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని సీజ్ చేసి, కారణాలపై అన్వేషణ జరగాలి కదా? మొత్తం వ్యవహారంపై సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలి"అని డిమాండ్ చేశారు.

## రాష్ట్రపతికి కోర్టు గడువు విధించవచ్చా..? కేంద్రం ఎలా స్పందించిందంటే..!



శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువు లోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై అభిప్రాయాలు తెలియజేయాలని ఇటీవల సుప్రీం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి పంపిన లిఖిత పూర్వక వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. అందులో రాష్ట్రపతి, గవర్నర్‌ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది. ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఉన్నత ఆదర్శాలను సూచిస్తాయని పేర్కొంది. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ.. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు (%ూబజూతీవఎవ జశీబతీ%) తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధింపుపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

# మేడ్చల్ లో పేలిన గ్యాస్ పైప్ లైన్

## - వాహనదారులకు ఇబ్బందులు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్నప్పుడు గ్యాస్ పైప్ లైన్ దెబ్బతిని పగిలింది. భూమిలోంచి గ్యాస్ ఎగసిపడుతుండటంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రమాదం జరగకముందే గ్యాస్ పైప్ లైన్ కంపెనీ వారు మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# అక్రమ సరోగసీ

## ఏడుగురు మహిళలు, ఒక పురుషుడు అరెస్ట్

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



మేడ్చల్ జిల్లాలో అక్రమ సరోగసీ, ఎగ్ ట్రేడింగ్ వ్యవహారంలో ఏడుగురు మహిళలు, ఒక పురుషుడితో సహా 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పేదింటి యువతులను సరోగసీ, అండాల దానానికి ఒప్పించి, వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ప్రధాన నిందితురాలు లక్ష్మి, ఆమె కుమారుడు నరేందర్ రెడ్డితో పాటు ఆరుగురు సరోగెంట్ తల్లుల నుంచి ప్రామిసరీ బాండ్లు రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా లక్ష్మి ఇలాంటి కేసుల్లో అరెస్ట్ అయి జైలుకు వెళ్లినట్లు సమాచారం.

# వాజపేయి వర్ధంతి

## బీజేపీ నాయకుల ఘన నివాళి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారి వాజపేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు పట్లోల విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయాల్లో శత్రువులే లేని విధంగా వాజపేయి నడిపారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ శిక్షణా తరగతులు




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ RVKలో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ (DMRKS) శిక్షణా తరగతులు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో BMS అఖిల భారత సంఘటనా కార్యదర్శి శ్రీ బి. సురేంద్రన్ జీ, తెలంగాణ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జంగిలి రామ్మోహన్, మరియు పలువురు DMRKS నాయకులు పాల్గొన్నారు. ఈ శిక్షణా తరగతులు కార్మికుల హక్కులు, సంఘ్ బలోపేతం వంటి అంశాలపై దృష్టి సారించాయి.

# కాంగ్రెస్ లక్ష్యం ప్రజా సంక్షేమం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా పేద ప్రజలను ఆదుకుంటుందని, ప్రజాభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని మెట్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ ఫిషర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మేడ్చల్ సరోగసి కేసు

## బాండ్లు, ఇంజెక్షన్లు స్వాధీనం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



మేడ్చల్ జిల్లా సరోగసి కేసులో సంచలనాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలు లక్ష్మి, సరోగసి మహిళలతో బాండ్లు రాయించుకున్నట్లు, తనిఖీల్లో భారీగా ప్రామిసరీ నోట్లు, బాండ్లు, పెద్ద ఎత్తున హార్మోన్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఐవీఎఫ్ సెంటర్లకు వెళ్లిన దంపతుల వివరాలను ఏజెంట్ల ద్వారా సేకరిస్తున్న లక్ష్మి, మహిళలను ప్రలోభపెట్టి సరోగసికి ఒప్పిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రూ.4-5 లక్షలకు మహిళలతో బేరం కుదుర్చుకుని, దంపతుల వద్ద రూ.25 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

# శ్రీ మురళీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల టౌన్ ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ మురళీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని పంచామృతాభిషేకం, నగర సంకీర్తన, పల్లకి సేవ, ఉట్టి కొట్టడం వంటి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సంవత్సరం విశేషంగా లక్ష పుష్పార్చన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు మైలారపు లింబాద్రి, కార్యవర్గం పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.

# గోధూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో శ్రీ కృష్ణా జన్మష్టమి వేడుకలు

**గాజెంగి మహేశ్వర్, మెటుపల్లి ప్రతినిధి**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యమాపూర్, పకీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటికొండాపూర్, వర్షకొండ, డబ్బ, అమ్మకపేట్, ఎర్రపుర్, ఇబ్రహీంపట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామాల్లో శనివారం శ్రీ కృష్ణా జన్మష్టమి సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ చిన్నారులను కన్నయ్య, రాధా గోపికల వేషధారణలతో అలంకరించి వేడుకలు జరుపుకున్నారు.

# 'నక్సల్స్‌తో చర్చలు జరిపి మీరేం సాధించారు? '

నక్సల్స్‌తో చర్చలు జరిపిన వారు ఏం సాధించారని ఆయన ప్రశ్నించారు. 'తూపాకీ పట్టి అమాయకులను చంపుతుంటే చూస్తూ ఊర్కోవాలా, నక్సల్స్ తూటాలకు 50 వేల మంది బలి అయ్యారు. 50 ఏళ్లలో భారీ విధ్వంసం జరిగింది. ప్రజాస్వామ్య విలువలను ధ్వంసం చేశారు. నక్సల్స్‌కు మద్దతిస్తున్న వారికి విద్యా కమిషన్ లో చోటు కల్పిస్తారా, ఎంతో మందిని నక్సల్స్ చంపినప్పుడు సామాజిక కోణం గుర్తుకురాలేదా, జాతీయ జెండాను ఎగరనీయని నక్సలైట్లు ఏ దేశ భక్తులు, బాక్సైట్ తవ్వకాల కోసమే 'ఆపరేషన్ కగార్' నిర్వహిస్తున్నారని ప్రచారం చేయడం దుర్మార్గం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు గనుల తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి కదా, బ్యాలెట్, బుల్లెట్ ఒకే ఒరలో ఉండలేవు. నక్సలైట్ల ఏరివేతను కొనసాగిస్తాం. 2026 మార్చినాటికి నక్సలిజాన్ని నిర్మూలించి తీరుతాం. నక్సల్స్ ముక్త్ భారత్ మా ధ్యేయం' అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# జల దిగ్బంధంలో జీవన్గి దేవాలయం

**బషీరాబాద్ కరపత్రం ప్రతినిధి**

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బషీరాబాద్ మండలంలో వాగులు , కాలువలు పొంగి పొర్లుతున్నాయి . మండలంలోని జీవన్గి గ్రామ సమీప ఒడ్డున ఉన్న మహాదేవ లింగేశ్వర దేవాలయం జలదిగ్బంధంలో ఉంది . తాండూరు కాగ్నా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జీవన్గి గ్రామ సమీపంలో వరద నీరు భారీగా నిలుస్తుంది , గ్రామ ప్రజలు , చుట్టు పక్కన ఉన్న గ్రామాల వారు మహాదేవ లింగేశ్వర దేవాలయం జలదిగ్బంధణ దృశ్యం చూడడానికి తరలివస్తున్నారు . గ్రామ చివరన ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరుతుంది . నీటి ప్రవాహం ఎక్కువ అవ్వుతుందోన్న ఆందోళన జీవన్గి గ్రామస్థుల్లో నెలకొంది .

# వలకు చిక్కిన 10 కిలోల భారీ చేప

**కరపత్రం ప్రతినిధి ధారూర్ గట్టుప్పల ఆగస్ట్ 16.**

మండలంలోని కోట్ పల్లి ప్రాజెక్టులో శనివారం ఉదయం స్థానికుల చేపల వేటలో పది కిలోల భారీ చేప చిక్కింది . ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో రకరకాల చేపలు బొచ్చ , రావుట , కొర్రమీను , వంటి భారీ సైజులో చేపలు లభిస్తున్నాయి . అటు వైపు వెళ్ళే ప్రయాణికులు చేపలు కొనుగోలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు . యువకులు చేపలు పట్టేందుకు పోటీ పడుతున్నారు . భారీ చేపలు లభిస్తుండడంతో చుట్టు పక్కల ఉన్న ప్రాంతాల వారు అక్కడికి చేరుకుంటున్నారు .

# తెలంగాణ కార్మిక సమాఖ్య...



తెలంగాణ కార్మిక సమాఖ్య...tks. వ్యవస్థాపకులు.. కల కోటి. రామన్న గారు.. బందెల. యాదగిరి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. రాష్ట్ర ఉపాధ్యక్షులు.. అల్వాల్ వెంకన్న. రాష్ట్ర కార్యదర్శి ఏసు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి. మల్లేష్..రాష్ట్ర. tks . విభాగం ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు.తూడి. మహేష్. గ్రేటర్ హైదరాబాద్. ఆటో యూనియన్. ప్రెసిడెంట్. శ్రీధర్ గౌడ్... TKS కన్న కిషోర్ గౌడ్. గేట్ హైదరాబాద్ అధ్యక్షులు. మరియు తదితరులు పాల్గొన్నారు జై కార్మిక జై జై కార్మిక. 2182025 రోజున మరియు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో. Tks. మీటింగ్ ను విజయవంతం చేయాలని కోరడం జరుగుతుంది జై భీమ్ జై కార్మిక కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి

## మూడవ వార్డులో నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు



**కరపత్రం ప్రతినిధి పరిగి:**

పరిగి మున్సిపాల్ పరిధిలోని మూడవవాడులో లో వోల్టేజ్ విద్యుత్ సమస్యలతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ విషయాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో వారి కృషితో శనివారం ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగింది.కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.మూడో వార్డు ఇంచార్జ్ ఎండి. ఏజాజ్ అధికారులతో కలిసి పనులను పర్యవేక్షిస్తూ కాలనీలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న నా దృష్టికి వచ్చిన వెంబడే తీర్చడానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు అనిల్, కాలనీవాసులు విద్యుత్ లైన్మెన్ పాల్గొనడం జరిగింది.

## కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన..డా.వెన్న ఈశ్వరప్ప



**కరపత్రం ప్రతినిధి కుల్కచర్ల:**

కుల్కచర్ల బిజెపి మండల కార్యదర్శి పి.వెంకటేష్ తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలియగానే ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వెన్న ఈశ్వరప్ప వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించడమే కాకుండా ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా పరిగి అసెంబ్లీ కన్వీనర్ తుప్ప విజయ్ కుమార్,మండల ఓబిసి మోర్చా అధ్యక్షులు మహేష్ , శక్తి కేంద్రం ఇంచార్జ్ వెంకటేష్ , బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి సందేశం

**కృష్ణ భగవానుడిని దర్శించుకోవడం మహాపుణ్యం.**

**అందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు**

**అల్వాల దర్శన్ గౌడ్**

**షాద్ నగర్: ఆగస్టు/ 16**

**కరపత్రం ప్రతినిధి**



కృష్ణుని పేరును ఒక్కసారి పిలిచినా "నేనున్నాను" అంటూ రక్షించే దైవం మన గోపాలకృష్ణుడు.

భక్తితో ఆయనను ఆరాధిస్తే ఆయురారోగ్యాలు ప్రసాదిస్తాడు ఐశ్వర్యం అనుగ్రహిస్తాడు సంతోషసమృద్ధులతో మన జీవితం నింపుతాడు ఈ కృష్ణాష్టమి సందర్భంగా అందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తూ అందరు భక్తులు ఆలయాలకు తరలి వెళ్లి శ్రీకృష్ణుడి దివ్యదర్శనం చేసుకోవాలని కోరుతున్నాను.

కృష్ణుని పాదసేవలో మన హృదయాన్ని అర్పిద్దాం. భజనలు, హరికథలు, గోపికల పాటలు, మకరందమయమైన భక్తి వాతావరణంలో పండుగను జరుపుకుందాం. కుటుంబమంతా కలసి కృష్ణుని భజిస్తే ఇల్లు ధన్యమవుతుంది.

# మన గణపతి మట్టి గణపతే : డాక్టర్ రఘురామన్




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 16**

హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు "మన గణపతి మట్టి గణపతే" అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్ ను సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురామన్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసినటువంటి విగ్రహాలను నెలకొల్పి వాటిని నిమర్జనం చేసినప్పుడు జరిగేటువంటి కాలుష్యాన్ని అరికట్టడానికి మనమందరం కూడా కృషి చేయాలి అని, అందుకోసం మనమందరం కూడా మట్టితో తయారు చేసిన విగ్రహాలని పూజించాలని కొనియాడారు. సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ మాట్లాడుతూ పెద్దపెద్ద గణేష్ మండపాలలో కూడా మట్టితో తయారు చేసినటువంటి విగ్రహాలను నెలకొల్పి పర్యావరణానికి తోడ్పాటు అందించాలని తెలిపారు. అలాగే మా సంస్థ పక్షాన వినాయక చవితి పండుగ రోజు 200 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని దీనిని భక్తులు వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘురామన్, సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ , ట్రెజరీ తొడుపునూరి తిరుపతి, సభ్యులు హిమాసాయి, నయన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేటలో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కరపత్రం ప్రతినిధి అందోలు:**

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంలో చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. గోకుల స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో నిర్వాహక్కులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజల మధ్య ఐక్యతను పెంచడానికి పండుగలు దోహదపడతాయి

## - సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

ప్రజల మధ్య ఐక్యతను పెంచడానికి పండుగలు దోహదపడతాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి శనివారం సంగారెడ్డి పట్టణంలోని మురళీ కృష్ణా ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

ఈ వేడుకలలో మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మాజీ కౌన్సిలర్ రామప్ప, విఠల్ రెడ్డి, లాడే బాలు, కొత్తపల్లి శ్రీకాంత్, మోహన్ సింగ్, శ్రవణ్ రెడ్డి, జలంధర్, గొల్ల ఆంజనేయులు, అక్బర్, అఖిల్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి బీరువా బహుమతి అందించిన విద్యోదయ హై స్కూల్స్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 16**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ హై స్కూల్ యాజమాన్యం ఆగస్టు 15 రోజున 79వ స్వాతంత్ర్య దినోత్సవం కార్యక్రమాన్ని జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులోని అంగన్ వాడీ సెంటర్లో జరువుకోవడం జరిగినది. ఈ కార్యక్రమానికి యేబూషి ఆర్యన్ కౌశిక్ కుమార్ (విద్యోదయ విద్యాసంస్థలు మేనేజింగ్ డైరెక్టర్) హజరైనారు వారి తండ్రి గారైన, క్రీ.శే. యేబూషి రామస్వామి (విద్యోదయ విద్యాసంస్థలు) చైర్మన్ , జ్ఞాపకార్ధంగా అంగన్వాడి సెంటర్ కి బీరువా ఇవ్వడం జరిగినది ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్స్ చాక్లెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఆయాలు పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు

# దళితులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి.



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 16**

హైదరాబాద్ లో మార్వాడిలు దళితుల పై దాడి చేస్తే వారికీ బండి సంజయ్ మద్దతు తెలుపడం సిగ్గు చేటు. దేశవ్యాప్తంగా మతతత్వవాదులు దళితుల పై దాడులు తెలంగాణలో కూడా దాడులు చేస్తే చూస్తూ ఊరుకోబోమ్ ప్రతి దాడులు ఉంటాయని హెచ్చరిక - తిప్పారపు సంపత్ టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంచార్జి హుజురాబాద్ పట్టణం లో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది అనంతరం తిప్పారపు సంపత్ టి పిసిసి ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంచార్జి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో గత వారం రోజుల కిందట మార్వాడిలు దళితుల పై దాడి చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా అందరు ఖండిస్తే బీజేపీ నేత కేంద్ర మంత్రి బండి సంజయ్ మాత్రం మార్వాడిలకు మద్దతుగా మాట్లాడడం సిగ్గు చేటు ఒక బాధ్యత గల కేంద్ర మంత్రి పదవిలో ఉండి దాడిని సమర్థిస్తూ వారికి మద్దతు తెలపడంతో కేంద్రమంత్రి బండి సంజయ్ కి తెలంగాణ దళితులపై ఎంత ద్వేషముందో ఈ సమాజానికి తేటతెల్లం కావడం జరిగింది, మతాల, కులాల గురించి మాట్లాడే బండి సంజయ్ ఒక దాడిని ఖండించలేని కనీస విజ్ఞత లేని వ్యక్తిగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుందని తన వైఖరి దళితుల పై దాడులే చేస్తాం అన్నట్టుగా బండి సంజయ్ వ్యవహార శైలి ఉందన్నారు దేశవ్యాప్తంగా బిజెపి పాలిత ప్రాంతాల్లో దాడులు చేస్తే మమ్మల్ని అడ్డుకునే వారు లేరని ఒక నియంత ధోరణితో వ్యవహరిస్తున్న బిజెపి నాయకులకు తెలంగాణలో కూడా అలానే వ్యవహరిస్తామంటే ఇక్కడ చూస్తూ ఊరుకోబోమని ప్రతి దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాం దళితులు అంటే అసమర్థులు కాదని దళితులు రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నారు కాబట్టి ఎక్కడ కూడా ప్రతిదాడి చేయడం లేదని స్పష్టంగా తెలియజేస్తున్నాం మేము ప్రతి దాడి చేస్తే మార్వాడి,గుజరాతీలు, బీజేపీ, వాళ్ళు ఒక్కడు కూడా రాష్ట్రం దాటి వెళ్లబోరని మా సహనాన్ని అసమర్థతగా భావిస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్ లాంటి వారికి తెలంగాణ రాష్ట్ర దళిత సమాజం తగిన బుద్ధి చెబుతుందని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాము

# ప్రభుత్వాలు మారిన మాతంగి కాలనీ వాసుల తల రాతలు మారవు

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక రోడ్లపైనే పారుతున్న డ్రైనేజీనీరు
- డెంగ్యూ లాంటి విష జ్వరాలు బారిన పడుతున్న కాలనీవాసులు





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 16:**

రామగుండం నియోజకవర్గంలోని ఎన్టిపిసి ప్రభావిత ప్రాంతమైన మాతంగి కాలనీ, అటు ఆర్ఎఫ్సీఎల్ నుండి ,ఇటు ఎన్టిపిసి నుండి వెలువడే దుమ్ము ధూళి తో అష్ట కష్టాలు పడుతున్నారు, ఆరోగ్యాలు చెడిపోయి, కిడ్నీలు చెడిపోయి, క్యాన్సర్ బారిన పడుతూ, దిక్కుతోచని స్థితిలో జీవనాన్ని వెల్లదీస్తున్నారు, గడచిన ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయింది. కేవలం ఎన్నికల సమయానికి ఓట్ల కోసం మాత్రమే వచ్చే నాయకులు, గెలిచిన తర్వాత కనీసం కాలనీ వైపు కూడా తొంగి చూడడం లేదు. పాత 39వ డివిజన్ పరిధిలోని మాతంగి కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ వారు ఎక్కువగా ఉండడం వల్ల పరిపాలన వివక్షకు గురవుతుందనేది బహిరంగ రహస్యం. అయితే మౌలిక సదుపాయాలు కల్పించవలసిన అధికార యంత్రాంగం నిద్రావస్థలో ఉండడం, కేవలం రాజకీయ జోక్యం ఉన్న కాలనీలు మాత్రమే అభివృద్ధికి నోచుకోవడం ప్రస్తుతం ఒక సాంప్రదాయంగా నడుస్తుందని డివిజన్ ప్రజలు చెప్పకనే చెబుతున్నారు. మాతంగి కాలనీలో సరియైన రోడ్లు లేవు కనీసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదు వర్షం పడితే డ్రైనేజీ నుంచి వచ్చే మురుగు నీరు పూర్తి స్థాయిలో ఇళ్లల్లోకి చేరడం దాని ద్వారా విపరీతమైన, దుర్వాసనతో కాలనీవాసులంతా డెంగ్యూ లాంటి విష జ్వరాల బారిన పడుతున్నారు, డ్రైనేజీ వాటర్ రోడ్లపైకి, కాలనీలో ఇండ్లలో పొంగిపొర్లడం వల్ల బోర్లలో ఉండే నీరు కూడా కలుషితమై దుర్వాసనతో నిత్యవసరాలు తీర్చుకోడానికి కూడా పనికిరాకుండా పోతుంది. ఇలాంటి దుర్భర పరిస్థితి కాలనీలో ఉన్నా కూడా గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతి ఒక్క నిరుపేదకు అభివృద్ధి ఫలాలు అందిస్తామని పేపర్లలో, వార్తలలో డబ్బా కొట్టుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో అది జరగడంలేదని మాతంగి కాలనీ పరిస్థితులను చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, అదే విధంగా కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించి కాలనీవాసులను ఇలాంటి దుర్భర పరిస్థితి నుంచి విముక్తి కలిగించాలని, ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేకు, అలాగే మున్సిపల్ అధికారులకు, ఈ సమస్యపై స్పందించాల్సిందిగా విన్నవించుకున్నామని, కానీ ఇప్పటివరకు ఎవరు స్పందించలేదని, ఈ సమస్య ఇలానే కొనసాగితే కాలనీ మొత్తం మురుగు కాలువలతో, డ్రైనేజీ నీటితో నిండిపోతుందని, కాలనీవాసులంతా కార్పొరేషన్ ఆఫీస్ లోకి వచ్చి తల దాల్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా కాలనీవాసులు కోరుతున్నారు.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రణవ్...







- మా ఇంట్లో కూడా కృష్ణాష్టమి వేడుకలు.
- ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 16**

హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ కృష్ణుడిని కోరుకున్నారు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్..శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా జమ్మికుంట,హుజురాబాద్ పట్టణాల్లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఉదయం మా ఇంట్లో కూడా కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనడం జరిగిందని,ఈ సందర్భంగా కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.చిన్నారులు శ్రీ కృష్ణుని వేషధారణలో ఉండగా వారిని దగ్గరికి తీసుకుని ముచ్చటించారు,మరోవైపు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని స్వయంగా వీక్షించారు ప్రణవ్.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ అయాజ్,టౌన్ సిఐ రామకృష్ణ గౌడ్,నిర్వాహకులు రాజు యాదవ్,పట్టణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 16**

శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల కరీంనగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడమైనది. ఈ సందర్భంలో విద్యార్థులు శ్రీకృష్ణుడి వేషధారణలో, గోపికల వేషధారణలో అలరించి అందరినీ ఆకట్టుకున్నారు.ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి ప్రసంగిస్తూ శ్రీకృష్ణుడి పుట్టుపూర్వోత్తరాలు, ఆయన గొప్పతనం, అలాగే ఆయన చెప్పిన ఉపదేశాలు మన నిజ జీవితంలో ఎలా ఉపయోగపడతాయో విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్కూల్ కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి పాల్గొని విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. ఆ తర్వాత ఉట్టి కొట్టి సందడిగా




కార్యక్రమం నిర్వహించారు.ఈ వేడుకలో డా. ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, తణుకు మహేష్, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, గోలి పూర్ణచందర్, కొత్తూరి



ముకుందం, గట్టు రాం ప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులాదేవి, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.